# ఎల్ఐసీ జీవితకాల బీమా

## గ్యారంటీడ్ రిటర్న్ ప్లాన్ జీవన్ ఉత్సవ్ పరిచయం




### రెండు ఆప్షన్లు

ఈ పాలసీలో రెండు ఆప్షన్లు కొనుగోలుదారులకు అందుబాటులో ఉంటాయి. ప్రీమియం చెల్లింపుల కాలం ముగిశాక వీటిలో ఏదో ఒకదాన్ని పాలసీదారులు ఎంచుకోవచ్చు.

**మొదటిది** రెగ్యులర్ ఇన్‌కమ్ బెనిఫిట్. దీని ప్రకారం బేసిక్ సమ్ అష్యూర్డ్‌లో 10 శాతం ఆదాయంగా పొందవచ్చు. ప్రతీ పాలసీ సంవత్సరం ముగింపులో ఈ ఇన్‌కమ్‌ను చెల్లిస్తారు. అయితే 3 నుంచి 6 ఏండ్ల వాయిదా వ్యవధి తర్వాత ఈ చెల్లింపులు మొదలవుతాయి.

**రెండోది** ఫ్లెక్సీ ఇన్‌కమ్ బెనిఫిట్. ఈ ఆప్షన్.. పాలసీకి సంబంధించి ఉన్న షరతులు, నియమ-నిబంధనలకు లోబడి ఉంటుంది. ఇక ఇందులో పాలసీ కాలంలో చెల్లించిన బేసిక్ సమ్ అష్యూర్డ్‌లో 10 శాతాన్ని పాలసీదారుడు అలాగే నిల్వ చేసుకుని ఆ తర్వాత దాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చు. ఇందుకుగాను 5.5 శాతం వార్షిక చక్రవడ్డీ ప్రయోజనాన్నీ పొందవచ్చు.

### పాలసీ విశేషాలు

- 90 రోజుల నుంచి 65 ఏండ్ల మధ్య వయసున్నవారు ఈ పాలసీ కొనుగోలుకు అర్హులు
- పాలసీ కనీస కాలవ్యవధి ఐదేండ్లు. గరిష్ఠ కాలవ్యవధి 16 ఏండ్లు
- గ్యారంటీగా జీవితకాల ఆదాయం, జీవితాంతం రిస్క్ కవరేజీ
- ప్రీమియంలు చెల్లిస్తున్నంతకాలం ఏటా మీరు తీసుకున్న బీమాలో ప్రతీ వెయ్యి రూపాయలకు రూ.40 చొప్పున గ్యారంటీడ్ అడిషన్స్
- పాలసీపై రుణ సదుపాయం కలదు. మెచ్యూర్ అవ్వకముందే విత్‌డ్రా చేసుకునే వెసులుబాటూ ఉంటుంది.
- పాలసీ మొదలైన ఏడాది తర్వాతి నుంచి జీవితాంతం బీమాప్రయోజనం

న్యూఢిల్లీ, నవంబర్ 29: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ).. బుధవారం 'జీవన్ ఉత్సవ్' పేరిట ఓ గ్యారంటీడ్ రిటర్న్ ప్లాన్‌ను పరిచయం చేసింది. ఇదో నాన్-లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్, ఇండివిడ్యువల్ సేవింగ్స్, పూర్తి జీవిత బీమా ప్లాన్ అని ఎల్ఐసీ ఓ ప్రకటనలో తెలియజేసింది. కంపెనీ చైర్మన్ సిద్ధార్థ ఇటీవల పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో.. పాలసీదారులు తాము తీసుకున్న పాలసీ మెచ్యూర్ అయ్యాక కనీసం అందులో 10 శాతాన్ని జీవితాంత ప్రయోజనంగా ఉండాలని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలోనే 'జీవన్ ఉత్సవ్' రాగా, ఇందులో ప్రీమియం కాలపరిమితి, వెయిటింగ్ పీరియడ్ తర్వాత ఏటా ఆదాయాన్ని అందుకోవచ్చని సంస్థ చెప్తున్నది.



# బంగారం ధగ.. ధగ..

## ఆల్‌టైమ్ హైకి ధరలు • రూ.820 పెరిగిన తులం ధర

## హైదరాబాద్‌లో రూ.63,380గా నమోదు

న్యూఢిల్లీ, నవంబర్ 29: బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి చేరుకున్నాయి. బుధవారం హైదరాబాద్‌లో తులం రూ.820 ఎగబాకింది. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ పుత్తడి 10 గ్రాములు రూ.63,380ని తాకింది. ఆభరణాల తయారీకి వినియోగించే 22 క్యారెట్ పసిడి కూడా రూ.750 ఎగిసి రూ.58,100ను చేరింది. ఇక ఢిల్లీలో రూ.750 పుంజుకొని రూ.63,500 వద్ద గోల్డ్ రేటు నిలిచింది.

**నిలకడగా పెరుగుతూ..**

బంగారం ధరలు నిలకడగా పెరుగుతున్నాయి. గడిచిన వారం రోజుల్లో 24 క్యారెట్ తులం బంగారం రూ.1,410, 22 క్యారెట్ రూ.1,300 పుంజుకున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఆల్‌టైమ్ హై వద్దకు చేరుకున్నాయి. అటు పండుగల సీజన్, ఇటు పెండ్లిళ్ల సీజన్ కావడంతో మార్కెట్‌లో పసిడి అమ్మకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని వ్యాపారులు సైతం చెప్తున్నారు. నిరుడుతో పోల్చితే ఈ ఏడాది ధనత్రయోదశికి బంగారం విక్రయాలు పెరిగిన విషయం తెలిసిందే.

**వెండి ధరలూ..**

బంగారం ధరలతోపాటు వెండి ధరలూ పెరిగాయి. బుధవారం కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ.700 ఎగిసి రూ.82,200లను తాకింది. గత వారం రోజుల్లోనూ రూ.3,200 పెరగడం గమనార్హం. ఢిల్లీలోనూ రూ.800 పుంజుకొని రూ.79,900 వద్ద నిలిచింది. సాధారణ కొనుగోలుదారులతోపాటు పరిశ్రమల నుంచీ డిమాండ్ ఉండటంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపార విశ్లేషకులు చెప్తున్నారు.

**గ్లోబల్ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 2,041 డాలర్లకు చేరింది. సిల్వర్ 24.95 డాలర్లు పలికింది. ఇక కొమెక్స్‌లో ఫ్యూచర్ గోల్డ్ ఔన్స్ 2,041 డాలర్లు, సిల్వర్ 27 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నది. డాలర్ బలహీనత, వడ్డీరేట్లపై ఫెడరల్ రిజర్వ్ తీరు మదుపరులను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మందకొడిగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

న్యూఢిల్లీ, నవంబర్ 29: ప్రస్తుత ఏడాది ఆశ్చర్యకరంగా అంచనాల్ని మించిన వృద్ధి సాధించిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వచ్చే సంవత్సరం వృద్ధి రేటు క్షీణిస్తుందని అంతర్జాతీయ ఏజెన్సీ ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) అంచనా వేసింది. 2024లో వృద్ధి రేటు 2.7 శాతానికి మందగిస్తుందని పేర్కొంది. 2020 కొవిడ్ పాండమిక్ తర్వాత అత్యంత కనిష్ఠస్థాయికి వృద్ధి ఇదే అవుతుందని తెలిపింది. ప్రస్తుత సంవత్సరం 2.9 శాతం వృద్ధి సాధిస్తుందని అంచనా. అధిక వడ్డీ రేట్లు, ఉక్రెయిన్-రష్యా యుద్ధంతో ఇంధన ధరలు పెరగడం వృద్ధిని ప్రభావితం చేస్తున్నట్టు తెలిపింది. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం నేపథ్యంలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొత్త రిస్కులు ఏర్పడుతున్నాయని ఓఈసీడీ హెచ్చరించింది.

## టీ-స్కేల్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు టీహబ్ వినూత్న కార్యక్రమాలను శ్రీకారంచుట్టింది. టీ హబ్ 8 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 16న టీ-స్కేల్ పేరుతో నూతన ప్రోత్సాహక కార్యక్రమాన్ని టీహబ్ ప్రారంభించింది. దీంతో ప్రారంభ దశలో ఉండి, మరింత విస్తర్ణ కార్యకలాపాలు చేపట్టే స్టార్టప్‌లకు సిరీస్-ఏ ఫండింగ్ ద్వారా అవసరమైన నిధులను సమకూర్చేలా దీన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను టీ హబ్ జారీ చేసింది. అర్హులైన స్టార్టప్ వ్యవస్థాపకులు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ( https://bit.ly/3QXl6P7 )లో సంప్రదించాలని సూచించారు.




టీ హబ్‌ను సందర్శించిన పానాసోనిక్ ప్రతినిధులతో సీఈవో ఎంఎస్ రావు తదితరులు



## హైదరాబాద్‌లో సీ1 జీఐసీసీ

కొండాపూర్, నవంబర్ 29: గ్లోబల్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ కంపెనీ కన్వర్జ్‌వన్ (సీ1).. బుధవారం రాయదుర్గం వద్దనున్న సత్వ నాలెడ్జ్ పార్క్‌లో తమ గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కెపాబిలిటీ సెంటర్ (జీఐసీసీ)ను ప్రారంభించింది. 20వేల చదరపు అడుగుల్లో తెచ్చిన ఈ సెంటర్‌ను దేశీయ విభాగం ఎండీ చంద్ర బొడ్డోజుతో కలిసి కంపెనీ సీఈవో జెఫ్రీ రస్సెల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేస్తామని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కస్టమర్లకు హైదరాబాద్ కేంద్రంగా సేవలందిస్తామన్నారు.

## మార్కెట్ @ 4 ట్రిలియన్ డాలర్లు

### తొలిసారి ఫీట్ సాధించిన భారత్



న్యూఢిల్లీ, నవంబర్ 29: దేశంలోని స్టాక్ మార్కెట్ విలువ చరిత్రలో తొలిసారిగా 4 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరింది. భారత కరెన్సీలో ఇది రూ.333.29 లక్షల కోట్లకు సమానం. బుధవారం జరిగిన పెద్ద ర్యాలీతో ఈ ఫీట్ సాధ్యపడింది. 2021 మే 24న బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ ప్రథమంగా 3 ట్రిలియన్ డాలర్లు తాకిన తర్వాత రెండున్నర ఏండ్లలో మరో 1 ట్రిలియన్ డాలర్లు పెరిగింది. 2007 మే నెలలో భారత్ మార్కెట్ విలువ మొదటిసారిగా ఒక ట్రిలియన్ డాలర్లను చేరింది. అక్కడ్నుంచి 1.5 ట్రిలియన్ డాలర్ల స్థాయిని అందుకోవడానికి దాదాపు ఏడేండ్లు (2014 జూన్) పట్టింది. 2 ట్రిలియన్ డాలర్లస్థాయిని 2017 జూన్ 6న అందుకుంది. 2.5 ట్రిలియన్ డాలర్ల విలువకు 2020 డిసెంబర్‌లో చేరింది. ప్రపంచంలో 4 ట్రిలియన్ డాలర్లను మించిన మార్కెట్లలో యూఎస్ (47.78 ట్రిలియన్ డాలర్లు), చైనా (9.74 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (6.02 ట్రిలియన్ డాలర్లు), హాంకాంగ్ (4.78 ట్రిలియన్ డాలర్లు) ఉన్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ తెలిపింది.

**727 పాయింట్ల ర్యాలీ**

అంతర్జాతీయ సానుకూల సంకేతాల నడుమ సెన్సెక్స్ 727 పాయింట్లు ర్యాలీ జరిపి 66,902 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సంవత్సరం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.50.90 లక్షల కోట్ల మేర పుంజుకుంది. అయితే ఈ ఏడాది సెప్టెంబర్ 15న సాధించిన రికార్డు 67,927 పాయింట్లను సెన్సెక్స్ ఇంకా అందుకోవాల్సి ఉంది. దాదాపు 1,000 పాయింట్ల దూరంలో ఉంది.

## అరబిందో హెచ్ఐవీ ఔషధానికి అమెరికా అనుమతి

హైదరాబాద్, నవంబర్ 29: అరబిందో ఫార్మాకు చెందిన హెచ్ఐవీ జనరిక్ ఔషధానికి యూఎస్ నియంత్రణ మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దరునవీర్ ట్యాబ్లెట్‌ను అక్కడ తయారు చేయడానికి, మార్కెటింగ్ చేసుకోవడానికి అనుమతినిచ్చినట్టు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ ట్యాబ్లెట్ 600 ఎంజీ, 800 ఎంజీల్లో లభించనున్నది.

## కెనరా బ్యాంక్ 5 వేల కోట్ల సేకరణ

బెంగళూరు, నవంబర్ 29: కెనరా బ్యాంక్ దీర్ఘకాలిక మౌలికసదుపాయాల బాండ్ల ద్వారా 5 వేల కోట్ల నిధులను సమీకరించింది. వార్షిక కూపన్ రేటు 7.68 శాతంగా ఉన్నది. ఈ బాండ్లకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపింది. ఇష్యూ సైజ్ రూ.1,000 కోట్లు కాగా, బిడ్లు మాత్రం రూ.12,450 కోట్లు వచ్చాయి.

